### పార్లమెంట్ ఎన్నికల్లో
## కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

■ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, ఏప్రిల్ 2 : గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి 100 రోజులు దాటినా అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతుల సందర్శన



మాట్లాడుతున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఆర్డీవో రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న పీవోలు, ఏపీవోల శిక్షణ తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో అనుసరించాల్సిన అంశాలను అధికారులకు వివరించారు. ఓటింగ్ ప్రారంభం, ముగింపు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన క్లుప్తంగా వివరించారు. ఈవీఎంల పనితీరు, వీవీ ప్యాట్లపై శిక్షణ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

# సెలవులు ముగిసేలోగా పనులు చేయించాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి,ఏప్రిల్ 2 : వేసవి సెలవులు ముగిసేలోగా జిల్లాలోని ఆయా పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అమలు, కమిటీల ఏర్పాటు, పనులు చేయించే విధానంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నీటి పారుదల, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీ, ప్యాకేజీ 9 ఈఈలు, అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,013 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల అమలు చేసినట్లు తెలిపారు. హెచ్ఎం, మహిళా సంఘాల్లోని సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. ఆ కమిటీల ఆధ్వర్యంలో జాతీయ బ్యాంక్‌లో ఖాతాలు ఓపెన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి రాజు, పీఆర్ ఈఈ సదాశివ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

### బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో
## యువకుడి ఆత్మహత్య

దోమకొండ, ఏప్రిల్ 2 : తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదనే మనస్తాపం చెంది మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి వంశీ(24) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బోరెడ్డి వంశీ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడు దోమకొండలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చివెళ్లేవాడని తెలిపారు. మద్యానికి బానిసయ్యాడని, ఇటీవల తన తల్లిదండ్రులతో తనకు బైకు కొనివ్వమని అడుగగా వారు తర్వాత కొనిస్తామన్నారు. ఈ విషయంలో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో దులానికి ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

## పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

క్వింటాలు రూ.13,800 కొనుగోలు

రెంజల్, ఏప్రిల్ 2 : ఉమ్మడి జిల్లాలో వీఎస్టీ కంపెనీ తరపున పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు కంపెనీ వైస్ చైర్మన్ అజయ్‌చౌదరి తెలిపారు. రెంజల్ మండలం కందకుర్తి, బోర్గాం, బోధన్ మండలం కొప్పర్గా, కల్దుర్కి, బాన్సువాడ నియోజకవర్గం నస్రుల్లాబాద్ మండలం అంకోలి గ్రామాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నాణ్యమైన పొగాకు క్వింటాలు రూ.13,800 ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కృష్ణారావు, నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్, మాజీ సర్పంచులు ఖలీంబేగ్, గొజ్జ రమేశ్, మేనేజర్ అల్తాఫ్ హుస్సేన్, గ్రేడర్స్ రామాంజనేయులు, పవన్, ఎఫ్ఏ సాయిలు, రైతులు పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్నకు నివాళి

పెద్దకొడప్‌గల్/భిక్కనూరు/బాన్సువాడ/బీబీపేట్, ఏప్రిల్ 2: పెద్దకొడప్‌గల్‌తోపాటు కాటేపల్లి గ్రామంలో జై గౌడ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పండరిగౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, నాయకులు మల్లప్ప పటేల్, బస్వరాజ్ దేశాయ్, కల్లూరి పండరి, మొగులాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. బీబీపేట్ మండలం మాందాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. బాన్సువాడలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్, జిల్లా అధ్యక్షుడు రవి, నాయకులు వస్సి, సాయిలు, సభ్యులు సాయికుమార్, విజయ్ కుమార్, ముజ్జు, సాయిప్రసాద్, తదితరులు ఉన్నారు.



పెద్ద కొడప్‌గల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన గ్రామస్తులు



భిక్కనూరు మండలం కాచాపూర్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు

### బీఆర్ఎస్ సమన్వయకర్త
## మామిండ్ల అంజయ్య రాజీనామా

కామారెడ్డి, ఏప్రిల్ 2 : ఇటీవల కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేసి ఓడి పోవడంతో కేసీఆర్ ఓటమికి బాధ్యుడిగా భావించి బీఆర్ఎస్ సమన్వయ కర్తగా ఉన్న మామిండ్ల అంజయ్య రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంప గోవర్ధన్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలిఅనిల్ కుమార్ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. తన రాజీనామాను కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఆమోదించాలని కోరారు.

## దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, ఏప్రిల్ 2 : తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారు నిర్వహించనున్న గ్రూప్-2, 3, 4 పరీక్ష కోసం మూడు నెలల ఉచిత రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ గ్రాడ్యుయేట్స్, ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్స్ కుటుంబ ఆదాయం 3 లక్షలు కన్నా తక్కువ ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, కలెక్టర్ ఆఫీస్ రూం నంబర్ 113లో ఈ నెల 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మొత్తం డిగ్రీ మెరిట్ ఆధారంగా చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒక సెట్ ఇన్‌కం, క్యాస్ట్, ఆధార్, రెసిడెన్షియల్, స్టడీ సర్టిఫికెట్లను జతపరచాలని, మరిన్ని వివరాలకు 8686388215 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## బాలుడి అదృశ్యం



మల్లారెడ్డి అరవింద్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 2 : కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి అరవింద్ అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లికి చెందిన మల్లారెడ్డి అరవింద్ ఆరో తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తన తమ్ముడిని స్కూల్ నుంచి తీసుకువస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు దేవునిపల్లి సీఐ 8712686148, ఎస్సై 8712686150 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ




బిచ్కుందలో అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రభాకర్


బిచ్కుంద, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని, ప్రశాంత వాతావరణంలో బాధ్యతగా వ్యవహరించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జుక్కల్ నియోజకవర్గంలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై మంగళవారం శిక్షణను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12ను తప్పకుండా పూర్తిచేసి సమర్పించాలని అన్నారు. పోలింగ్ రోజున అవసరమయ్యే కవర్‌లో సరైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. అనంతరం బిచ్కుంద తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. బిచ్కుంద తహసీల్దార్ సురేశ్, గిర్దావర్ రవీంద్రనాథ్, ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దారు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

***ఎన్నికల విధులపై శిక్షణ..***

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 2: ఎల్లారెడ్డిలోని మోడల్ డిగ్రీ కాలేజీలో పీవో, ఏపీవోలకు ఒకరోజు శిక్షణా శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన 372 మంది అధికారులు శిక్షణకు హాజరయ్యారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రభాకర్ వారికి ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర చర్యలను వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీబీ కాదు.. బై బై పాటిల్

ఎంపీపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫైర్



అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 2: బీబీ కాదని బై బై పాటిల్ అని, తెలుగు రాని జహీరాబాద్ ఎంపీతో ప్రజలు ఎన్నో బాధలు పడ్డారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు అధికారం అనుభవించి, ప్రస్తుతం అధికారం పోగానే బీజేపీలో చేరి ఎంపీగా పోటీ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించకపోవడంతో రూ.50కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులు వెనక్కి వెళ్లాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సాడేసాత్‌ను వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

**కాలభైరవుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

రామారెడ్డి, ఏప్రిల్ 2: రామారెడ్డిలోని కాలభైరవస్వామి ఆలయంలో మంగళవారం బహుళ అష్టమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సందర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## ‘మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ కార్యదర్శులదే..’

సదాశివనగర్, ఏప్రిల్ 2: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను సంరక్షించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీవో సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్ గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఆయన మంగళవారం పరిశీలించారు. వానలు కురియగానే నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేసి, నాటేవిధంగా చూడాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

రామారెడ్డి, ఏప్రిల్ 2: మండల కేంద్రలోని దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వెంకటస్వామి చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. సాక్ష్యం సంస్థ సౌజన్యంతో నలుగురు దివ్యాంగులకు బ్యాటరీ వీల్‌చైర్, ఒకరికి వినికిడి యంత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో సంగమేశ్వర్

నిజాంసాగర్, ఏప్రిల్ 2: అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో సీఈవో సంగమేశ్వర్ మంగళవారం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి నాగరాజు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పిట్లం, ఏప్రిల్ 2: మండలంలోని ధర్మారం, చిన్నకొడప్‌గల్ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకును తనిఖీ చేశారు.

## పింఛన్ కోసం వృద్ధుల ఎదురుచూపులు



గ్రామ పంచాయతీ వద్ద పింఛన్ కోసం బైఠాయించిన వృద్ధులు

నిజాంసాగర్, ఏప్రిల్ 2: మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామ పంచాయతీ వద్ద పింఛన్ కోసం పలువురు వృద్ధులు మంగళవారం బైఠాయించారు. వృద్ధుల్లో చాలా మందికి వేలి ముద్రలు పడకపోవడంతో పంచాయతీ కార్యదర్శి వేలిముద్రల ద్వారా ప్రతినెలా వారికి పింఛన్ డబ్బులు అందజేస్తారు. పంచాయతీ కార్యదర్శి రాక కోసం మంగళవారం ఉదయం ఇలా వారు నిరీక్షించారు.



ఉపాధ్యాయుడు లేక ఖాళీగా కూర్చున్న విద్యార్థులు



ఖాళీగా దర్శనమిస్తున్న హెచ్ఎం కుర్చీ

## సమయపాలన పట్టని ఉపాధ్యాయులు

- ప్రార్థనలో ఉన్నది ఒక్కరే..
- డోంగ్లీ ప్రాథమిక పాఠశాలలో ఇదీ పరిస్థితి

డోంగ్లీ, ఏప్రిల్ 2: డోంగ్లీ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 170 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడితో కలిసి ఆరుగురు ఉపాధ్యాయులు ఇక్కడ విధులను నిర్వహిస్తున్నారు. కానీ ఎవరూ సమయపాలన పాటించడం లేదు. ఒంటిపూట బడులు కావడంతో ఉదయం 7:50 గంటలకు ప్రార్థనతో పాఠశాల ప్రారంభం అవుతున్నది. మంగళవారం ఉదయం ప్రేయర్‌కు కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారందరూ 8:22గంటల తర్వాతనే పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లో ఆడుకుంటూ కనిపించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంపై ఎంఈవో రాములు నాయక్‌ను వివరణ కోరగా.. ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, RENJARLA MADHU SUDHAN S/o. RENJARLA GANGARAM, H.No. 1-25/1, Kammarpally, (D) Nizamabad. Changed my name as RENJARLA MADHUSUDHAN REDDY

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్, ఏప్రిల్ 2: జుక్కల్ మండలంలోని చిన్నఏడ్గి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. అక్కడ ఉన్న కూలీలతో మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. అప్పుడే గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విజయ్‌షిండే, ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి తదితరులు ఉన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నిజాంసాగర్, ఏప్రిల్ 2: మహ్మద్‌నగర్ మండలంలోని తున్కిపల్లి గ్రామానికి చెందిన కుర్మ రాములు వారం రోజుల క్రితం బాన్సువాడ నుంచి తున్కిపల్లి గ్రామానికి వస్తున్నారు. దారిలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో నాలుగు రోజుల క్రితం నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశామని ఎస్సై సుధాకర్ ఆదివారం తెలిపారు.

## ఓవర్‌లోడ్ వాహనాలకు పన్ను విధించాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్, ఏప్రిల్ 2: ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు పన్ను విధించాలని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మద్నూర్ మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద పలు వాహనాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల సమయం కావడంతో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఆయనవెంట ఎంవీఐ సుభాష్, ఏఎంవీఐ రామచంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

## చెక్‌పోస్టు వద్ద రూ.రెండు లక్షల నగదు పట్టివేత



వెల్గనూర్ శివారులోని హైవేపై పట్టుకున్న నగదుతో ఎస్సై సుధాకర్, సిబ్బంది

నిజాంసాగర్, ఏప్రిల్ 2: మండలంలోని వెల్గనూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.రెండు లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కడప జిల్లాకు చెందిన రాంచంద్రారెడ్డి రూ.రెండు లక్షలను తీసుకెళ్తున్నాడని అన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పోలీసు, చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఉన్నారు.

***గోపన్‌పల్లి చౌరస్తా వద్ద..***

బిచ్కుంద, ఏప్రిల్ 2: మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. హస్గుల్ గ్రామానికి చెందిన చంద్రకళ వద్ద రూ.1,25,000కు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారికి అప్పగించామన్నారు.